
సాక్షి బాపట్ల

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి తెలంగాణ మధిరకు చెందిన జంగా రామ్ భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.లక్ష అందజేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 66,450 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 64,450 క్యూసెక్కులు వదులుతున్నారు. నీటి నిల్వ 42.1600 టీఎంసీలు .



క్రాకర్స్ షాపుల్లో తనిఖీలు

చిలకలూరిపేట టౌన్: దీపావళి క్రాకర్స్ షాపుల్లో గురువారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. యజమానుల వద్ద ఉన్న లైసెన్సులు, అనుమతి పత్రాలను పరిశీలించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి పుష్పార్చన



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరాలయంలో గురువారం లోక కల్యాణార్థం దాతల సహకారంతో స్వామికి పుష్పార్చన నిర్వహించారు. తొలుత మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేసి సహస్ర నామాలతో రుత్విక్కులు పుష్పార్చన జరిపారు. అనంతరం బాల చాముండికా అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

రాజ్యలక్ష్మీఅమ్మవారికి బంగారు హారం బహూకరణ



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ దిగువ సన్నిధిలో ఉన్న శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారికి దాత బంగారు హారాన్ని బహూకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సునీల్‌కుమార్ తెలిపారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం రూ. 3.50 లక్షల విలువైన బంగారు పచ్చల హారాన్ని మంగళగిరి పట్టణానికి చెందిన నీలి నాగమల్లేశ్వరరావు, రత్నకుమారి దంపతులు గురువారం ఆలయ అధికారులు, అర్చకులకు అందజేశారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్ పర్యటన



గుంటూరు రూరల్: వెంగళాయపాలెంలో మహాత్మాగాంధీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ వాటర్ షెడ్ ప్రోగ్రాం డిప్యూటీ కమిషనర్ సాగర్, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్‌లు గురువారం పర్యటించారు. గ్రామ పంచాయతీలో 21.38 ఎకరాల ఊర చెరువు ఉంది. వాటర్ షెడ్, అమృత్ సరోవర్ పథకాలలో భాగంగా చెరువుకు రివిట్‌మెంట్, వాకింగ్ ట్రాక్, ప్లాంటేషన్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి, ఎంపీడీవో బి. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రవి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శ్రీరామ్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగదు రహిత చికిత్స అందించాలి



గుంటూరు వెస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత చికిత్స అందించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా కోరారు. ఈ మేరకు గురువారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ ఉత్సవకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ నెట్‌వర్క్ ఆసుపత్రుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా సేవకు అంకితమైన ఉద్యోగుల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు యు.సుమిత్రా దేవి, సంయుక్త కార్యదర్శులు కోటా సాహెబ్, వి.కార్తిక్, కోశాధికారి శ్రీనివాస్, మహిళా విభాగం నాయకులు రమణి, మయూరి పాల్గొన్నారు.

సుబాబుల్‌తో కాసుల గలగల

- రైతు చూపు సుబాబుల్ వైపు
- జిల్లాలో 20వేల ఎకరాల్లో సాగు
- ధర కూడా వస్తుండటంతో ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- టన్ను రూ.5,800లకు కాగితం తయారీ కంపెనీలు కొనుగోలు
- ఒకసారి వేస్తే 20 ఏళ్ల వరకు దిగుబడి
- పశువుల మేతగా ఉపయోగపడనున్న ఆకులు
- రాజమండ్రి, భద్రాచలం, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాలకు ఎగుమతి



అద్దంకి ప్రాంతంలో సాగు చేసిన తోట

అద్దంకి: అన్నదాతలకు సంప్రదాయ సాగు భారంగా మారింది. అధిక పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలు పీల్చి పిప్పి చేస్తున్నాయి. తీరా పంట చేతికొచ్చేసరికి పడి పోతున్న ధరలతో నష్టాలే మిగులుతున్నాయి. సంప్రదాయ పంటల సాగుకు వెనకడుగు వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో లాభాలొచ్చే పంటలపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఒక్కసారి నాటితే ఇరవై సంవత్సరాల పాటు ఆదాయాన్నిచ్చే సుబాబుల్ సాగు వైపు అడుగులేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 20 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. ఈ ఏడాది మరో 10 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది.

వేగంగా పెరిగే సుబాబుల్

వేగంగా పెరిగే చెట్ల జాతిలో సుబాబుల్ ఒకటి. దీని ఆకులు పశుగ్రాసంగా ఉపయోగ పడతాయి. కాండాన్ని కాగితపు గుజ్జు పరిశ్రమలో ముడి సరుకుగా ఉపయోగిస్తారు. చౌడు నేలల మినహా అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. ఎక్కువ తేమ కలిగిన నేలలు బాగా అనుకూలం. కాలువ, పొలాల గట్లపై పెంచుకోవచ్చు. నాటిన రెండు నుంచి మూడేళ్లకే కర్ర దిగుబడి వస్తుంది.



కర్రను లోడ్ చేస్తున్న కూలీలు

నేలసారం పెంపు

సుబాబుల్ తోటల సాగుతో సారం పెరుగుతుంది. నేలలోని పెట్రోలియం, పురుగు మందులు, భారీ లోహాలు వంటి కలుషితాలను తొలగించడానికి ఉపయోగపడుతుంది. రాలిన ఆకు ఎరువుగా మారి భూమి సారవంతంగా మారుతుంది.

ఎకరాకు 30 టన్నుల దిగుబడి

సాలుకు సాలుకు మధ్య రెండు మీటర్లు, మొక్క మొక్కకు మధ్య రెండు మీటర్ల దూరం ఉండాలి. ఎకరాకు 666 మొక్కల నుంచి 1000 వరకు నాటుకోవచ్చు. ఎకరాకు 30 టన్నుల నుంచి సారవంతమైన నేలలు అయితే 40 టన్నుల వరకు కూడా దిగుబడి వస్తుంది. చెట్టు మూడు నుంచి నాలుగు సంవత్సరాలో 20 మీటర్ల ఎత్తు పెగుతుంది. ముదురుతోటలో విత్తనాలు సేకరించి నాటుకోచ్చు. లేదా నర్సరీల నుంచి మొక్కలు తెచ్చి నాటుకోవచ్చు.

పదేళ్ల నుంచి సాగు చేస్తున్నా..

నేను పదేళ్ల నుంచి సుబాబుల్ సాగు చేస్తున్నా. గిట్టుబాటు ధర బాగుంది. ఎరువు వేసి నీరు పెడితే మంచి దిగుబడి వస్తుంది. పైగా కర్ర తాట తీసే పనిలేకుండా కొనుగోలు చేస్తారు. పెద్దగా నీటి అవసరం లేదు. సాగు చేయటం కూడా తేలిక. సుబాబుల్ కర్రను కాగితం తయారీ కంపెనీలు కొంటున్నాయి. –కోటేశ్వరరావు, రైతు

ఏటేటా పెరగనున్న ఆదాయం

సుబాబుల్ చెట్టు కర్రను ఒలిచే పని లేకుండా నేరుగా కొట్టి విక్రయించుకోచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర రూ.5,800 పలుకుతోంది. రెండు సంవత్సరాల తోట అయితే ఎకరాకు రూ.1 లక్ష వరకు, నాలుగు సంవత్సరాలు అయితే ఎకరాకు రూ.1.5 లక్షల నుంచి రూ. 2.5లక్షల వరకు ఆదాయం వస్తుండటంతో పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

డీఎంఎఫ్ పనుల్లో పురోగతి కన్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

బాపట్ల: డీఎంఎఫ్ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్రతి వారం పురోగతి కన్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్ర శిక్ష అభియాన్, పబ్లిక్ హెల్త్, సీపీఓ, విద్యుత్, భూగర్భ గనుల శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా జిల్లా ఏర్పడిన నాటికి రూ.35 కోట్లు డీఎంఎఫ్ నిధులు ఉన్నాయని తెలిపారు. అప్పటి నుంచి మూడున్నర ఏళ్లలో మరో రూ.16 కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. డీఎంఎఫ్ కింద మొత్తం రూ.51 కోట్లు ఉండగా, వివిధ శాఖల ద్వారా 31 పనులకు గానూ రూ.48.28 కోట్లు అధికారికంగా మంజూరయ్యాయని వివరించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.5.77 కోట్ల పనులు మాత్రమే జరగడమేమిటని ఆయన ప్రశ్నించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చీరాల ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న 167ఏ జాతీయ రహదారిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రూ.1,065 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులు జిల్లాలో 95 శాతం పూర్తయ్యాయని, నవంబర్ నెలాఖరకు ముగించాలని చెప్పారు.

అంతర్గత రోడ్లు వేగంగా నిర్మించాలి

కలెక్టరేట్‌లో అంతర్గత రహదారులను ఆర్ అండ్ బీ అధికారులు వేగంగా నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతర్గత రహదారులు, ఏటీఎం గది ప్రతిపాదిత ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.47.9 లక్షలతో ప్రతిపాదించిన అంతర్గత రహదారి ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఆర్ అండ్ బీ డీఈ అరుణకుమారి, అధికారులు ఉన్నారు.

బాపట్ల జిల్లా జేసీగా భావన వశిష్ట



బాపట్ల టౌన్: బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి భావన వశిష్టను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ ప్రారంభించిన ఆమె తరువాత పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ అడిషనల్ డైరెక్టర్‌గానూ సేవలందించారు. ఎన్నికలకు ముందు అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. గడిచిన 15 నెలలుగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజా ఉత్తర్వుల్లో భాగంగా బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.

భారత రాయబారిగా విల్సన్ బాబు నియామకం



రాష్ట్రపతి నుంచి నియామక పత్రం అందుకుంటున్న విల్సన్‌బాబు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి బండారు విల్సన్ బాబు తుర్క్‌మెనిస్థాన్ దేశానికి భారత రాయబారిగా నియమితులయ్యారు. పాఠశాల ఆవరణలో గురువారం హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విల్సన్‌బాబు పాఠశాలలో1995–96లో పదో తరగతి చదివినట్లు చెప్పారు. తల్లిదండ్రులు బండారు కృపారావు, తల్లి ప్రిస్కెల్లాలు ఉపాధ్యాయులు కాగా 2004లో సివిల్స్ పరీక్షలు రాసి 272వ ర్యాంకు సాధించారని వివరించారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో చేరి ఇప్పటి వరకు మడగాస్కర్ దేశ భారత రాయబారిగా సేవలందించినట్లు తెలిపారు. బుధవారం తుర్క్‌మెనిస్థాన్‌కు భారత రాయబారిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు వివరించారు. పాఠశాల పాలకవర్గం అధ్యక్షులు బొగ్గవరపు చెంచు పున్నయ్య, గ్రామ సర్పంచ్ బండారు సుమతి, పి. బాబయ్య, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది విల్సన్ బాబుకు అభినందనలు తెలిపారు.





చేయీ చేయి కలిపారు..

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా స్థానిక విరలేశ్వరస్వామి నగర్ కాలనీ నివాసితులు నడుం కట్టారు. చేయీ చేయి కలిపి రోడ్డును వేసుకున్నారు. ఇటీవల వర్షాలకు కాలనీ ప్రధాన రహదారి కాలువగా మారింది. నీరు నిలిచి పసికర్లు కూడా కట్టింది. నివాసితుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే లోతట్టు ప్రాంతం. పైగా కాలనీ పక్కగా వెల్లటూరు చానల్ పారుతుండటంతో ఊట నీరు దిగి మరింత ముంపునకు గురవుతోంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు నిలిచి రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. నిల్వ నీటితో జ్వరాలు, వ్యాధులు ప్రబలుతాయేమోనని భయంతో వణికిపోయారు. దీంతో కాలనీలోని అంతర్గత రహదారిలో నివసిస్తున్న ఏడుగురు కలసి సొంత ఖర్చుతో రోడ్డుకు మెరక తోలించుకున్నారు. – భట్టిప్రోలు

కూటమి కుట్రలపై విధేయతదే విజయం!

యుద్ధంలో నెగ్గాలంటే ఎవరికైనా ఒక్కటే మార్గం.. వీరోచిత పోరాటమే శరణ్యం. అదే ధర్మయుద్ధం. అది చేతకాని వారికి వెన్నుపోటు, వంచనలే ఆయుధాలు అవుతాయి. ఇక ప్రజాస్వామ్యంలో ప్రజలు మెచ్చి ఇచ్చిన పదవులే పెద్ద విజయం. మండల ప్రజాపరిషత్ ఎన్నికల సంగ్రామంలో వైఎస్సార్‌సీపీ సువర్ణ పరిపాలనకు బహుమతిగా నాలుగేళ్ల క్రితం ప్రజలు ఆ పార్టీ నేతలకు బ్రహ్మరథం పట్టారు. తెలుగుదేశం పార్టీకి మచ్చుకైనా మెజార్టీ రాలేదు. ఇలా గుంటూరు జిల్లా పెదకాకాని, పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలాల్లో ఎంపీపీ పదవులు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ముప్పాళ్లలో టీడీపీకి కనీసం ఒక్క సభ్యుడూ లేరు. కానీ, అధికారం అండగా కూటమి ప్రభుత్వం తన కండకావరాన్ని ఇప్పుడు చూపుతోంది. ఎంపీపీ పదవిని కైవసం చేసుకోవడానికి ప్రలోభాలు, బెదిరింపుల పర్వానికి తెరలేపింది. కానీ వైఎస్సార్‌సీపీకి వీరవిధేయులైన ఎంపీటీసీ సభ్యుల తెగువ ముందు అవేవీ పనిచేయడం లేదు. వారిని ఆర్థికంగా దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్న పచ్చ పార్టీ నేతలకు పట్టపగలే చుక్కలు కనిపించేలా ధైర్యంగా సమాధానం ఇస్తున్నారు. దీంతో రెండు చోట్లా కంగుతినడం తమ్ముళ్ల వంతవుతోంది. అవిశ్వాసం, వెన్నుపోట్లకు మారుపేరైన చంద్రబాబు పార్టీపై వైఎస్సార్‌సీపీ సభ్యుల 'విధేయత'దే విజయం అయింది.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం

- పావులు కదుపుతున్న తమ్ముళ్లు
- ఇప్పటికే ఫోన్ ద్వారా సంప్రదింపులు
- పార్టీ మారేది లేదని తేల్చి చెప్పిన ఎంపీటీసీ సభ్యులు



పెదకాకాని మండల పరిషత్ కార్యాలయం

పెదకాకాని: ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే తెలుగు తమ్ముళ్లు ఆ దిశగా పావులు కదుపుతున్నారు. మండలంలోని పలువురు ఎంపీటీసీలకు ఫోన్‌లు చేసి నయానా, భయానా చర్చలు జరిపే పనిలో నిమగ్నమయ్యారు. అయితే పార్టీలు మారి పరువు పోగొట్టుకోవడానికి తాము సిద్ధంగా లేమని పలువురు ఎంపీటీసీ సభ్యులు స్పష్టంచేసినట్లు చెబుతున్నారు. పెదకాకాని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడుగా అనుమర్లపూడి ఎంపీటీసీ సభ్యుడిని ఎన్నుకొని నాలుగేళ్లు పూర్తయ్యింది. నాలుగేళ్ల వరకూ ఎంపీపీ కుర్చీపై అవిశ్వాసం పెట్టడానికి అవకాశం లేదనే నిబంధనలు ఉన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినప్పటికీ నాలుగేళ్లు పూర్తయ్యే వరకూ వేచి ఉన్నారు. గత నెల సెప్టెంబరుతో నాలుగేళ్లు పూర్తి కావడంతో ఎంపీపీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెదకాకాని మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీలు, ఒక హామ్లెట్ విలేజ్ ఉంది. ఆయా గ్రామాల్లో ఉన్న ఓటర్ల ఆధారంగా మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వారిలో వైఎస్సార్ సీపీ చెందిన 15 మంది ఎంపీటీసీ సభ్యులు, ఆరుగురు టీడీపీ చెందిన ఎంపీటీసీలు గెలుపొందారు. మెజారిటీ ఎంపీటీసీ సభ్యులు ఉన్న వైఎస్సార్ సీపీ నుంచి అనుమర్లపూడి ఎంపీటీసీ సభ్యుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావును ఎంపీపీగా ఎన్నుకున్నారు. తమ్ముళ్ల రాయబారాలు నడుపుతున్నప్పటికీ పార్టీ మారడానికి, ఎంపీపీకి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంలో పాల్గొనడానికి పలువురు ఎంపీటీసీ సభ్యులు ససేమిరా అంటున్నారు. వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి వారి మద్దతుతో విజయం సాధించి పదవీకాలం పది నెలలు ముందు తాము పార్టీ మారడానికి, చేతులెత్తడానికి సిద్ధంగా లేమని చెబుతున్నారు. ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ నుంచి పార్టీ మారిన వారిని కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుని ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదనే చర్చ కూడా సాగుతోంది.

ముప్పాళ్ల ఎంపీపీ పీఠంపై గురి

- బలం లేకున్నా టీడీపీ బరితెగింపు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై వేధింపుల పర్వం
- అవిశ్వాసం అంటూ డ్రామా



ఎంపీడీవో కార్యాలయం

ముప్పాళ్ల: ముప్పాళ్ల మండల పరిషత్ అధ్యక్ష పీఠంపై టీడీపీ నాయకులు గురి పెట్టారు. 2021లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు పదకొండు స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందారు. జనసేన ఒక స్థానంలో గెలుపొందింది. టీడీపీ ఒక్కచోట కూడా గెలిచిన దాఖలాలు లేవు. మాదల ఎంపీటీసీ సభ్యుడు మృతి చెందగా ప్రస్తుతం ఆ స్థానం ఖాళీగా ఉంది. భయపెడుతూ, ప్రలోభాలకు గురిచేస్తూ, పదవి ఆశ చూపుతూ ఆరుగురు ఎంపీటీసీలను టీడీపీ వైపునకు లాక్కున్నారు. ఎంపీపీతో కలిపి నలుగురు ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీని వీడేందుకు ఇష్ట పడకపోవటంతో వారిపైన, వారికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను దెబ్బకొట్టేలా అధికార దర్పాన్ని ఉపయోగించుకుంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

కొత్తగా తెరపైకి అవిశ్వాసం డ్రామా

కొత్తగా ఎంపీపీపై అవిశ్వాస డ్రామాను టీడీపీ నాయకులు తెర లేపారు. చాగంటివారిపాలెంకు చెందిన ఎంపీపీ మారూరి పద్మపై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు సమావేశం నిర్వహించాలంటూ సత్తెనపల్లి ఆర్డీఓను మంగళవారం కలసి వినతిపత్రం అందించారు. అవిశ్వాస తీర్మానం ఇవ్వాలంటే కనీసం 8 మంది ఎంపీటీసీ సభ్యుల బలం ఉండాలి. ఎనిమిది మంది సభ్యులు ఆర్డీవో ఎదుట హాజరై అవిశ్వాస తీర్మానం కోరుతూ వినతి పత్రం అందించాల్సి ఉంటుంది. కేవలం ఐదుగురు సభ్యులతో సంతకాలు చేయించి అవిశ్వాస తీర్మానం అంటూ డ్రామా చేస్తున్నారు. ఈ విషయం పై వైఎస్సార్‌సీపీ సభ్యులు మాత్రం పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటామని ఖరాఖండిగా తేల్చి చెబుతున్నారు.

పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉన్నాం.

–మలిరెడ్డి అనూష, లంకెలకూరపాడు ఎంపీటీసీ

సోషల్‌మీడియాలో టీడీపీ నాయకులు చేస్తున్న విష ప్రచారంలో వాస్తవం లేదు. అవిశ్వాస తీర్మానంపై ఆర్డీఓకు ఇచ్చిన పేపర్లలో తన సంతకాన్ని ఫోర్జరీ చేశారు. వైఎస్సార్ సీపీ నిర్ణయానికే కట్టుబడి ఉంటాం. కేసులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడేది లేదు.

క్లుప్తంగా

ప్రజా సంక్షేమం కోసమే జీఎస్టీ తగ్గింపు



చీరాల రూరల్: ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు చేసిందని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల పెనుభారాన్ని తగ్గించేందుకు గతంలో నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీని ప్రస్తుతం రెండుగా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వి. వినోద్‌కుమార్, గుంటూరు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

రావినూతల విద్యార్థినుల ప్రతిభ



వర్షిత



హనీ

మేదరమెట్ల: అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని బాపట్ల జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గురువారం విశేష ప్రతిభ కనపరచారు. బాపట్లలో గురువారం 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అనే అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఇందులో రావినూతల హైస్కూలుకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.హనీ జిల్లాస్థాయిలో రెండో స్థానం, చిత్రలేఖనం పోటీలో పదో తరగతి విద్యార్థిని ఎం.వర్ష ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లా కేంద్రంలో ఈనెల 11న నిర్వహించే బహుమతి ప్రదానోత్సవంలో రూ. 3 వేలు, రూ. 5 వేల చొప్పున అందుకోనున్నట్లు పాఠశాల హెచ్ఎం రాఘవరెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

విశ్రాంత ఎస్పీ మృతి

నగరంపాలెం: విశ్రాంత పోలీస్ అధికారి ఎన్.గోపాలరావు (87) అంత్యక్రియలు గురువారం జరిగాయి. బుధవారం డొంకరోడ్డులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. గోపాలరావుకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1961లో ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరి సీఐ, డీఎస్పీ, ఏఎస్పీ, ఎస్పీగా విధులు నిర్వహించారు. ఏపీ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.రంగాప్రసాద్, కోశాధికారి డాక్టర్ కేవీ నారాయణ తదితరులు నివాళులర్పించారు.

అంతర్రాష్ట్ర గజదొంగ అరెస్ట్

- రూ. 8 లక్షల సొత్తు రికవరీ
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది కేసులు నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్

బాపట్ల టౌన్: ఇళ్లలో బంగారు అభరణాలు, నగదు చోరీ చేసే గజదొంగను బాపట్ల సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీసీఎస్ డీఎస్పీ బి. జగదీష్‌నాయక్ గురువారం వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పల్నాడు జిల్లా, యడ్లపాడు మండలం, యడ్లపాడు గ్రామానికి చెందిన కోడిరెక్క విజయ్‌కుమార్ తాపీ మేస్త్రిగా జీవనం సాగిస్తుండేవాడు. చెడు వ్యసనాలకు లోనై సులభ రీతిలో డబ్బు సంపాదించేందుకు దొంగ అవతారమెత్తాడు. ఓ దొంగతనం కేసులో తెలంగాణ రాష్ట్రంలోని చౌటుప్పల్ పోలీసులు 2022లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బెయిల్‌పై వచ్చి యడ్లపాడు గ్రామంలో తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2023లో చిలకలూరిపేట, యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడ్డాడు. చిలకలూరిపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. బెయిల్‌పై వచ్చిన జగదీష్‌నాయక్ మరలా ఈ ఏడాది అద్దంకి, సంతమాగులూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడాడు. ఇతడి కదలికలపై నిఘా పెట్టిన సీసీఎస్ పోలీసులు గురువారం ఉదయం అద్దంకి-మేదరమెట్ల బైపాస్ రోడ్డు జంక్షన్ సమీపంలో అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 5.70 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 30 వేలు విలువ చేసే వెండి అభరణాలు, రూ. 1.15 లక్షల నగదుతో పాటు రూ. 70 వేలు విలువ చేసే ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీసీఎస్ సీఐ పి.ప్రేమయ్య, అద్దంకి పట్టణ సీఐ ఏ.సుబ్బరాజు, సీసీఎస్ ఎస్.ఐ బి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. కేసును ఛేదించడానికి విశేష కృషిచేసిన సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, సీఐ పి.ప్రేమయ్య, ఎస్ఐ బి.రాంబాబు, కానిస్టేబుళ్లు ఎస్.కోటేశ్వరరెడ్డి, కె.చిరంజీవి, డి.వై.దాసు, కృష్ణలను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.

అండర్ - 19 బాలుర ఖోఖో జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

జెవంగులూరు: స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గురువారం ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ -19 విభాగంలో బాలుర ఖోఖో జట్టు ఎంపిక చేశారు. జిల్లా నుంచి 40 మంది వచ్చినట్లు కళాశాల పీడీ సీతారామిరెడ్డి తెలిపారు. సీనియర్ క్రీడాకారుడులు షేక్ అహ్మద్, పీడీ రవికిరణ్, వేణు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన 12 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ ఎం.చింపారెడ్డి, ఆర్ఐఓ ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల నుంచి సీహెచ్. బాబ్జీ, యస్. భరత్ కుమార్, ఐ. ప్రవీణ్ రెడ్డి, పి. నరేష్, డి. విజయ్, సి. లక్ష్మీనారాయణ, సీహెచ్. నాగవర్ధన్, ఎం. ఆంజనేయులు, ఐ. అనిల్, కె. మోహన్‌రావు, శ్రీ విద్యానికేతన్ సింగరాయకొండ నుంచి ఏ. రమణ కృష్ణారెడ్డి, సాయిబాబు చైతన్య జూనియర్ కళాశాల నుంచి ఆర్. విఖ్యాత్ రెడ్డి ఎంపికయ్యారు.

స్టాండ్ బై క్రీడాకారులు

మాగుంట సుబ్బారామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల నుంచి ఎం. దానియేలు, సి. శివ ప్రసాద్, బి. గోపీచంద్ స్టాండ్ బైగా ఎంపికయ్యారు.

12న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక



తెనాలి: స్థానిక ఆంధ్రా ప్యారిస్ బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన 'రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక' జరగనుంది. బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుంది. స్థానిక రామలింగేశ్వరపేటలోని మూల్పూరు సుబ్రహ్మణ్య కల్యాణ మండపంలో గురువారం విలేకరుల సమావేశంలో కేంద్రం పాలకవర్గ అధ్యక్షుడు టి.దక్షిణామూర్తి సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి ఉచిత భోజన సౌకర్యంతో పాటు సమాచార బుక్‌లెట్ ఇస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ సత్య కుమార్, సంయుక్త కార్యదర్శి పింగళి వేణుధర్, గౌరవాధ్యక్షుడు పీఎల్‌జీఎస్ ప్రకాశరావు, కోశాధికారి ఆర్.రాజేంద్రప్రసాద్, గౌరవ సలహాదారు బీఎల్ సత్యనారాయణమూర్తి, సభ్యులు డీవీ సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు వెస్ట్: ఖరీఫ్ సీజన్ 2025-26లో ధాన్యం సేకరణపై ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యాన ఖరీఫ్ సీజన్ 2025-26లో ధాన్యం సేకరణపై అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో 50 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం (కామన్) క్వింటా (100కిలోలు) రూ.2369, 'ఏ' గ్రేడ్ రకం క్వింటా (100కిలోలు) రూ.2,389లుగా నిర్ణయించినట్లు తెలిపారు. గత సంవత్సరం మద్దతు ధర కన్నా రూ.69 అధికంగా చెల్లించనున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఏడు గంటలలోపు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గుంటూరు జిల్లా కంట్రోలు రూం ఏర్పాటు చేసినట్లు(నం.9491392717) తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం తులసి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండ్లమూడి వెంకయ్య చౌదరి, మిల్లర్లు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్ ఏర్పాటు వ్యాధిగ్రస్తులకు వరం

జిల్లా క్షయ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సోమల నాయక్



అధికారులతో మాట్లాడుతున్న నాయక్

అద్దంకి: స్థానిక సీహెచ్‌సీలో ఏఆర్‌టీ సెంటర్ ఏర్పాటు క్షయ వ్యాధిగ్రస్తులకు వరమని బాపట్ల జిల్లా క్షయ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సోమల నాయక్ అన్నారు. సీహెచ్‌లో ఏఆర్‌టీ సెంటర్ ఏర్పాటు చేయనున్న దృష్ట్యా గురువారం సందర్శించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.కె. వాహిలా చౌదరి, బాపట్ల జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం, దిషా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ బాషా, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్టర్ బీవీ సాగర్‌తో కలిసి హాస్పిటల్లో కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. సోమల నాయక్ మాట్లాడుతూ హాస్పిటల్‌కి వచ్చే హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా గదులను ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో శాశ్వత భవనాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో 1,300కు పైగా ఉన్న హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఏఆర్‌టీ సెంటర్ ఉపయోగపడుతుందని చెప్పారు. గతంలో వ్యాధిగ్రస్తులు మందుల కోసం ఒంగోలు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కొన్నిసార్లు రవాణా చార్జీలు లేక ఇతర కారణాల ద్వారా మందులు మధ్యలో ఆపివేస్తుండటంతో ఆరోగ్యం క్షీణించి మరణానికి దగ్గరవుతున్నారని తెలిపారు. అద్దంకిలోనే ఏఆర్టీ సెంటర్ తీసుకురావడం ద్వారా వారు క్రమం తప్పకుండా మందులు వాడుకునే అవకాశం ఉంటుందని, త్వరలోనే ఇక్కడ ఏర్పాటు చేస్తామని సోమల నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. తేజస్విని, డాక్టర్ అనిత జ్యోతి, ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్, పారా మెడికల్ ఆఫీసర్ ఎన్. శ్రీనివాసరావు, బి. దుర్గ సురేంద్ర, ఔట్ రీచ్ వర్కర్ దుర్గా భవాని పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ

- చోరీ చేసిన సొత్తుతో దంపతుల జల్సాలు
- పదమూడు కేసులు నమోదైనా ఏమీ తెలియనట్టు గ్రామంలో మకాం
- ఇళ్లల్లో చోరీలకు పాల్పడే భర్త, భార్య అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: పగలు పల్సర్ బైక్‌పై తిరుగుతూ తాళాలు వేసి ఇళ్లను గుర్తించి, రాత్రిళ్లు చోరీలకు పాల్పడే భార్యాభర్తలను కొల్లిపర పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. దంపతుల నుంచి 173.19 గ్రాముల బంగారం, 226.36 గ్రాముల వెండి, రూ.2.15 లక్షలు, ఒక మోటారు సైకిల్, టీవీ, ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం ఆయన మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. ఇటీవల కొల్లిపర మండల పరిధిలోని తాళాలు వేసి ఇళ్లల్లో వరుసగా చోరీలు జరిగాయి. తూములూరు గ్రామ వాసి మాటూరి మధుసూదనరావు గతనెల 28న ఊరెళ్లారు. ఈనెల 2న ఇంటికి రాగా, బీరువాలో దాచిన బంగారు సొత్తు చోరీ చేశారు. దీనిపై బాధితులు కొల్లిపర పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తెనాలి సబ్ డివిజన్ డీఎస్పీ బి.జనార్దనరావు, రూరల్ సీఐ ఆర్.ఉమేష్ నేతృత్వంలో కొల్లిపర పీఎస్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు పరిసరాల్లోని సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. సాంకేతిక ఆధారాలతో కొల్లిపర గ్రామ వాసి కటారి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం రుజువైంది. గతంలోనూ మండల పరిధిలోని పలు గ్రామాల్లో 13 చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ చోరీల్లో కొంత వరకు భార్య తేజ నాగమణికి ఇచ్చి భద్రపరిచేవాడు. దీంతో భార్యాభర్తలను అరెస్ట్ చేసి, 173.19 గ్రాముల బంగారం, 226.36 గ్రాముల వెండి, రూ.2.15 లక్షలు, పల్సర్ బైక్, ఒక టీవీ, ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నారు.

ఇనుపరాడ్‌తో తాళాలు పగులకొట్టి..

గతంలో వెంకటేశ్వర్లు బేల్దారి పనులకు వెళ్లేవాడు. భార్యాభర్తలు కొద్దికాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. భర్త ద్విచక్ర వాహనం (పల్సర్)పై వెళ్లి ఇళ్లకు తాళాలు వేసిన గృహాలను గుర్తించే వాడు. ఆ తర్వాత ఇరువురు కలసి చోరీకి వెళ్లేవారు. భర్త ఇనుపరాడ్డుతో తలుపులు పగులకొట్టి, బంగారం, వెండి వస్తువులు, నగదుతో రెప్పపాటులో ఉడాయించేవాడు. భార్య ఘటనా స్థలంలో ఉండి వచ్చే, పోయే వారి కదలికలను గుర్తించేది. చోరీలకు పాల్పడి వచ్చాక ఏమీ తెలియనట్టు అందరితో కలిసిపోయేవారు. దొంగిలించిన సొమ్ముతో జల్సాలు చేయడం, వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకునేవారు. నిందితుడైన వెంకటేశ్వర్లుకు పాత నేర చరిత్ర ఉంది. దాదాపు 13 కేసులు నమోదై ఉన్నాయి. త్వరితగతిన కేసు ఛేదించిన తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, తెనాలి రూరల్ పీఎస్ సీఐ ఆర్.ఉమేష్, కొల్లిపర పీఎస్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, హెచ్‌సీలు రామకోటేశ్వరరావు, మురళీకృష్ణ, పీసీలు కూర్మారావు, శివరామకృష్ణలను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు



హనుమంతరావు (ఫైల్)

శావల్యాపురం: మండలంలోని వేల్పూరులో సూరాబత్తుని హనుమంతరావు (58) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు అంగీకారంతో పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు నేత్రదానం చేసినట్లు జిల్లా జనవిజ్ఞాన వేదిక జనరల్ సెక్రటరీ సంద్రపాటి చలపతిరావు తెలిపారు. కార్నియాను ఇద్దరు అంధులకు అమర్చి కంటి చూపు వచ్చేలా చేస్తారన్నారు. మరణానంతరం ఎవరైనా పది గంటలలోపు నేత్రాలను దానం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో శంకర వైద్య నిపుణులు, హనుమంతరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మనోవ్యాధులకూ మంచి ఔషధాలు

- ప్రతి ఏడాది పెరుగుతున్న మానసిక సమస్యలు
- 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

కరోనా వల్ల పెరిగిన మానసిక సమస్యల బాధితులను దృష్టిలో పెట్టుకుని మానసిక ఆరోగ్యానికి , వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మానసిక సమస్యలపై అవగాహన కల్పించి ప్రజలు ఇబ్బంది పడకుండా చేసేందుకు ప్రతి ఏడాది అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ' సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.



మానసిక ఆరోగ్యదినోత్సవం పోస్టర్

గుంటూరు మెడికల్: జిల్లాలో 25 మంది మానసిక వ్యాధి వైద్య నిపుణులున్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు రోజూ 30 నుంచి 50 మంది వివిధ రకాల మానసిక సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో రోజూ 160 మంది చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది మానసిక రోగుల సంఖ్య పెరిగిపోవటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల్లో సైతం సమస్యలు రావటంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.


వ్యాధి లక్షణాలు ఇవీ..

చిరాకు, కోపం, విసుగు తదితర లక్షణాలు వారానికి పైబడి ఉంటే మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించాలి. తనలో తాను మాట్లాడుకోవటం, ఒంటరిగా నవ్వుకోవటం, వ్యక్తిగత శ్రద్ధ తీసుకోకపోవటం, చేసిన పనిని పదేపదే చేయాలనుకోవటం, అనవసరమైన ఆలోచన్లి ఆపుకోలేకపోవటం, నిద్రలోపం, బరువు పెరగటం, నిర్ణయాలు తీసుకోవటంలో తీవ్ర జాప్యం చేసి తనమీద ఆధారపడే వారందరినీ ఇబ్బందికి గురి చేయడం, తాను కూడా ఇబ్బందులకు గురవ్వటం, ఎక్కువ సమయం పనిమీద ఏకాగ్రత లేకుండా కాలక్షేపం చేసే ధోరణిలో ఉండటం, తనకు హాని చేస్తున్నట్లు ఊహించుకుని తగాదాలు వరకు వెళ్లటం, తిరగబడి దాడి చేయటం, వ్యక్తిలో ఉన్న అనుమానాలు ఎన్ని రూపాల్లో నివృత్తి చేసే ప్రయత్నం చేసినా ఒప్పుకోకపోవటం తదితర లక్షణాలు మానసిక వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి. రోటీన్ లైఫ్‌కు భిన్నంగా ఉండే ప్రవర్తన కనిపిస్తే వారిలో మానసిక సమస్య ఉన్నట్లు గుర్తించాలి. చదువుకునేందుకు ఆసక్తి చూపించకపోవటం, ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌లకే పరిమితమవ్వటం, ఉద్యోగం, ఇతర పనులు చేయకుండా ఉండిపోవటం లక్షణాలు వ్యాధి బాధితుల్లో ఉంటాయి.

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు..

ఏడాది	రోగుల సంఖ్య
2023	22,189
2024	30,553


ఈ జాగ్రత్తలు తీసుకోవాలి....



మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఆందోళనకు గురిచేసే విషయాలను పట్టించుకోకూడదు. మద్యం, పొగతాగటం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. కంటికి సరిపడా ఆరు నుంచి తొమ్మిది గంటలపాటు నిద్రపోవాలి. కుటుంబ సభ్యులందరితో కలిసి కొంత సమయాన్ని గడపాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. మానసిక వ్యాధులకు మందులు ఉన్నాయి.

– డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, మానసిక వ్యాధి నిపుణుల సంఘం జిల్లా అధ్యక్షుడు

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



మానసిక వ్యాధులకు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలను అందించటంతోపాటుగా మందులు కూడా ఉచితంగానే అందజేస్తున్నారు. అవుట్ పేషేంట్ విభాగంలోని 21వ నెంబర్ గదిలో వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారిని ఇన్‌పేషేంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుంటారు. సోమవారం నుంచి శనివారం వరకు రోజూ ఓపీలో వైద్య సేవలు లభిస్తాయి. మందులతోపాటుగా రోగులకు కౌన్సెలింగ్ కూడా చాలా ముఖ్యం.

– డాక్టర్ నీలి ఉమాజ్యోతి, మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్.

పశు సంతతిని పెంచుకోవాలి

ప్రత్తిపాడు: గ్రామాల్లో రోజురోజుకీ తగ్గిపోతున్న పశుసంతతిని పెంచుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వి.వి. సత్యనారాయణ అన్నారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో గురువారం ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేలుజాతి లేగ దూడల ప్రదర్శనను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ ప్రత్తిపాడు ఏడీ సుగణ్యరావు, ఇతర అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పాడి రైతులు లేగ దూడలకు సరైన పోషకాహారం అందించాలని సూచించారు.

మా ఆత్మగౌరవాన్ని కాపాడండి !



నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

పిడుగురాళ్ల: తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని సచివాలయ ఉద్యోగులు మొర పెట్టుకుంటున్నారు. సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పుతూ తమతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని వాపోతున్నారు. వీటితోపాటు తమ ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చర్చలకు పిలవకపోతే ఈ నెల 19న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లను తొలగించటంతో ఆ విధుల భారాన్ని తమపై మోపారన్నారు. జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ

సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది. ఇప్పటికీ ఏ శాఖలో పని చేస్తున్నామో అర్థం కావటం లేదు. రేషలైజేషన్ ప్రక్రియతో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాం. ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు.

– నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్

మహిళలకు గౌరవం లేదు

సచివాలయాల్లో పని చేస్తున్న మహిళలకు గౌరవం లేకుండాపోతోంది. శానిటరీ సెక్షన్‌లో పనిచేసే సచివాలయ ఉద్యోగులకు తెల్లవారుజామున 4 గంటలకు రోడ్లపై విధులు కేటాయిస్తున్నారు. కార్యాలయాల్లో వసతులు కూడా లేవు.

– దీప్తి, మహిళా పోలీస్